ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కరీంనగర్
జిల్లా వార్తలు
3
సోమవారం 6 మే 2024



హోరెత్తుతున్న ప్రచారం

- అన్ని నియోజకవర్గాల్లో నేతల పర్యటనలు
- ముఖ్య గ్రామాలు, పట్టణాల్లో రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లు
- రేపు కరీంనగర్‌లో రాహుల్‌గాంధీ జనజాతర సభ
- జిల్లాలో పర్యటించి వెళ్లిన కేసీఆర్, రేవంత్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఏడు రోజుల్లో పోలింగ్ జరుగనుంది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారాలు జోరందుకున్నాయి. అన్ని పార్టీల కీలక నేతలు నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. సవాళ్లు, ప్రతి సవాళ్లతో రాజకీయాలను వేడెక్కిస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నప్పటికీ ఎండలను సైతం లెక్కచేయకుండా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు ప్రచారాలను కొనసాగిస్తున్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో తన సిట్టింగ్ స్థానాన్ని తిరిగి దక్కించుకోవడానికి భారతీయ జనతా పార్టీ అభ్యర్థి బండి సంజ య్‌కుమార్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ స్థానాన్ని ఎలాగైనా కైవసం చేసుకోవాలని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రయత్నిస్తున్నాయి.

● అభ్యర్థులకు అండగా అగ్రనేతలు



ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్ప టికే నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో ప్రచారం నిర్వహించారు. రెండోసారి బరిలో నిలిచిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే నియోజకవర్గంలో ప్రజాహిత యాత్ర నిర్వ హించారు. మాజీ ఎంపీ, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని ఆ పార్టీ ముందుగానే ప్రకటించడంతో ఇప్పటికే ఆ యన నియోజకవర్గంలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో పార్టీ ముఖ్య నాయకుల సభ లు, సమావేశాలు, కుల సంఘాల ప్రతినిధులతో సమావేశాలను నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆలస్యంగా పార్టీ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావు ప్రకటించింది. ఆమర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రణాళికతో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. దీంతో ఇక్కడ ముక్కోణపు పోటీ నెలకొన్నది. నువ్వా..నేనా అన్న రీతిలో పోటీ నెలకొనడంతో ఆయా పార్టీలు అగ్రనేతలు మరోసారి పర్యటించేందుకు ఏర్పాట్లు చేసుకునానరు.

● 8న వేములవాడలో ప్రధాని సభ

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఈనెల 7న కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన జనజాతర సభకు హాజరై ఆ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా ప్రచారం చేస్తారు. 8వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ వేములవాడ నియోజకవర్గ కేంద్రంలో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌తో కలిసి రోడ్ షో నిర్వహించి, అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో పాల్గొంటారు. కరీంనగర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు 9న రోడ్ షోలో పాల్గొని ప్రచారం చేస్తారు.

● జోరుగా స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌లు...ఇంటింటి ప్రచారాలు

ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో గతంలో మాదిరిగా బహిరంగ సభలే కాకుండా ఈసారి బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌లను నిర్వహిస్తున్నారు. వారంరోజులుగా ప్రతి ఇంటికి వెళ్లి ఆయా పార్టీల మెనిఫెస్టో, హామీలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేస్తూ ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. ప్రతిరోజు ఉదయం 7 నుంచి10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ఇంటింటి ప్రచారాలు, రాత్రి 10 గంటల వరకు రోడ్‌షోలు, స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నారు. అభ్యర్థులు నియోజకవర్గ పరిధిలోని ముఖ్యపట్టణాల్లో వాకర్స్, వివిధ వర్గాల ప్రజలను కలిసి తమకు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు.

నాలుగు నెలల్లోనే ప్రభుత్వంపై వ్యతిరేకత

- ఎన్నికలెప్పుడొచ్చినా బీఆర్ఎస్‌దే అధికారం
- తమలపాకు నమలడం.. ఇష్టం వచ్చినట్లు తిట్టడం తప్ప బండి సంజయ్ చేసిందేమీ లేదు
- వడ్లు అమ్ముకునేటప్పుడు రైతుబంధు ఇస్తారా...?
- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్



హుజూరాబాద్/వీణవంక, మే 5: నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందని మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. ఆదివారం వీణవంకలో బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ తమ హయాంలో తెలంగాణ ప్రజలకు తాగు, సాగునీరు అందించాలని కాళేశ్వరం ప్రాజెక్టును కట్టామని, రైతులు ఇక చాలు అనే వరకు సాగు నీళ్లు ఇచ్చామన్నారు. రైతులు పండించిన పంట దళారుల పాలు కావద్దని ప్రతి గింజనూ కొన్నామన్నారు. కాళేశ్వరం నీళ్లతో మూడున్నర కోట్ల కింటాళ్ల వరి ధాన్యం పండించి పంజాబ్ రాష్ట్రాన్ని దాటామన్నారు. డిసెంబరు 9న రైతుబంధు ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరిధాన్యం అమ్ముకుంటున్నా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ఇక్కడి ఎంపీ బండి సంజయ్ తమలపాకు నమలడం, తిట్టడం తప్పితే.. కరీంనగర్ అభివృద్ధికి చేసింది ఏం లేదన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అని వ్యక్తి అన్నారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి యువకుడని, రాజకీయాల్లో ఎదిగే సత్తా ఉందన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థికి 1.5 లక్షల మెజార్టీ రావాలన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రధాని మోదీ గోదావరి నీళ్లను తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు తరలించేందుకు కుట్ర చేస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నప్పుడు చేయడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఐటీ రంగం హైద్రాబాద్‌కు పెద్ద ఎత్తున కంపెనీలు తరలివచ్చాయన్నారు. ప్రధాని మోదీ అసూయపడే వి.దంగా పెట్టుబడులు తెచ్చామన్నారు. తెలంగాణ ఉద్యమం ఇంకా అయిపోలేదని, పునర్నిర్మాణ ప్రక్రియ మిగిలి ఉందన్నారు. తాను చేస్తున్న బస్సు యాత్రకు వచ్చిన ఆదరణ చూసి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కై 48 గంటల పాటు ప్రచారాన్ని ఆపాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో 24 గంటల నాణ్యమైన కరెంటు ఇస్తే కాంగ్రెస్ వచ్చిన తర్వాత కరెంటు కోతలు ఎందుకు విధిస్తున్నారని ప్రశ్నించారు. జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. సమావేశంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ నారాదాసు లక్ష్మణ్ రావు, జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మాజీ ఎమ్మెల్యే రసమయి బాల కిషన్, టూరిజం మాజీ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, బండ శ్రీనివాస్, తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, పరిపాటి రవీందర్‌రెడ్డి, ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, జడ్పీటీసీ మాడ వనమాల-సాధవరెడ్డి, గంగాడి తిరుపతిరెడ్డి, వాల బాలకిషన్‌రావు పాల్గొన్నారు.



వీణవంకలో ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ప్రజలు



వీణవంక ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్

● బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్

వీణవంక: మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం విజయవంతం కావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. సమేశనానికి ఐదు వేల మంది హాజరయ్యారు. శనివారం అర్ధరాత్రి వీణవంకకు చేరిన కేసీఆర్ రాత్రి బస చేసి ఉదయం స్థానిక నాయకులు, పార్టీ నేతలతో ముచ్చటించారు. సభ అనంతరం బస్టాండు కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించి వీడ్కోలు పలికారు.

కరీంనగర్ అభివృద్ధికి తపనతో పని చేస్తా..

- ప్రజల మనోభావాలతో బీజేపీ ఆడుకుంటోంది..
- కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు

కరీంనగర్ అర్బన్, మే 5: కరీంనగర్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు తపనతో పని చేస్తానని, తన తండ్రి వెలిచాల జగపతిరావు ఆశయాలను ముందుకు తీసుకెళతానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. నగరంలోని హౌసింగ్‌బోర్డ్ కాలనీవాసులతో రాజేందర్‌రావు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు సంధ్యాలేని బండి సంజయ్ లాంటివారికి ఓటేస్తే అభివృద్ధి సాధ్యం కాదన్నారు. బీజేపీ నేతలు అయోధ్యలో దేవుడి ప్రతిష్ఠ జరకముందే పసుపు బియ్యం పంపించి, వాటిని అక్షింతలు అని నమ్మించి ప్రజల మనోభావాలను దెబ్బతీశారని విమర్శించారు. జీఎస్టీని 16 శాతానికి పెంచి నిత్యావసరాల ధరలు పెంచి సామాన్య మధ్యతరగతి ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు గురిచేశారన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని హనుమాన్ టెంపుల్, శివాలయాల అభివృద్ధికి, వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో కలిసి రాజేంద్రరావు అల్పాహారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్, ఏడో డివిజన్ కార్పొరేటర్ భర్త, మాజీ కార్పొరేటర్ ప్రకాష్‌రావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెలిచాల రాజేందర్‌రావు

● జిల్లా అభివృద్ధికి విజనరీ ప్రణాళిక

జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతోపాటు తన సొంత ఖర్చుతో విజనరీ ప్రణాళికను రూపొందించినట్లు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. ఆదివారం నగరంలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాజేందర్‌రావు మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యులకు కేంద్రం నుంచి ప్రతి ఏడాది ఐదు కోట్ల నిధులు మంజూరు అవుతాయని, దాంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా కొన్ని నిధులు సమకూరుతాయని తెలిపారు. వాటితోపాటు తను సొంతంగా ప్రతి ఏటా 15 కోట్ల నిధులను ఖర్చు చేసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టబోతున్నట్టు ప్రకటించారు. యంత్ర చేయూత పేరుతో ప్రతి నియోజకవర్గానికి ఒక అంబులెన్స్‌తోపాటు పలు యంత్రాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ పరికరాలతో నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో అవసరమైన మరమ్మతులు చేయనున్నట్టు తెలిపారు. యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తానన్నారు. మెరిట్ సాధించిన విద్యార్థులకు ల్యాప్ టాప్‌లు, పారితోషకాలు అందిస్తానన్నారు. క్రీడా స్థలాల ఏర్పాటు కృషి చేస్తానన్నారు. కరీంనగర్ నుంచి ఒక్కరినైనా భారత క్రికెట్ జట్టులోకి పంపించడమే తన ధ్యేయమన్నారు. సిరిసిల్ల నేత కార్మికులను ట్రేడింగ్ రంగం వైపు మళ్లించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే తన ఉద్దేశమని పేర్కొన్నారు. ఫోన్ టాపింగ్‌ను వెలికి తీసిందే కాంగ్రెస్ పార్టీ అని, ప్రస్తుతం పారదర్శకంగా విచారణ జరుగుతున్న తరుణంలో బీజేపీ, బీఆర్ఎస్ నేతల్లో వణుకు మొదలైందని విమర్శించారు. తనను కరీంనగర్ ప్రజలు గుర్తుపట్టరని కేటీఆర్ చేసిన విమర్శలపై మాట్లాడుతూ దొంగ బీ ఫారంలు ఇచ్చి నయవంచనకు పాల్పడిన నీ అయ్యని అడుగు.. నేను ఎవరో చెప్తాడని అన్నారు. సిగ్గూ, శరంలేని కేటీఆర్‌కు తన గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. తన అండ కాంగ్రెస్ పార్టీ అని.. తన బలం రేవంత్‌రెడ్డి అని.. తన బలగం కరీంనగర్ జిల్లా ప్రజలని.. తను నమ్మకం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి అని స్పష్టం చేశారు.



అల్పాహారం చేస్తున్న రాజేందర్‌రావు

కమిషనరేట్ వ్యాప్తంగా వాహనాల తనిఖీ



నగరంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, మే 5: పోలీసులు కమిషనరేట్ వ్యాప్తంగా ఆదివారం వాహనాలు తనిఖీ చేశారు. అక్రమంగా డబ్బు, మద్యం ఇతర బహుమతులు రవాణాను అడ్డుకునేందుకు వాహనాలను తనిఖీ చేశామని సీపీ అభిషేక్ మహంతి తెలిపారు. వాహనాల తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు.

కేసీఆర్ చేసిన మోసాలను గుర్తు చేసుకోవాలి

- ఢిల్లీకి కప్పంకడుతున్న కాంగ్రెస్ నాయకులు
- ఆరు గ్యారెంటీల అమలుకు డబ్బుల్లేవనడం సిగ్గుచేటు
- ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మే 5: కేసీఆర్ చేసిన పాపాలు, మోసాలను ప్రజలు గుర్తు చేసుకోవాలని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో వాకర్స్‌ను ఆయన కలిసి ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ మళ్లీ డ్రామాలాడుతూ ఓట్లు దండుకోవడానికి మీ ముందుకు వస్తున్నాడన్నారు. కాంట్రాక్టర్లకు వేలకోట్ల బిల్లులు చెల్లించేందుకు, ఢిల్లీకి కప్పం కట్టేందుకు డబ్బులిస్తున్న కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలకు డబ్బుల్లేవనడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్ నమ్మించి గొంతు కోసే రకమని అన్నారు. పదేళ్ల పాలనలో రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, అన్ని వర్గాలను రాచి రంపాన పెట్టిన సంఘటనలు, ప్రశ్నించే గొంతులను నులిమి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందన్నారు. మోదీ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాలతో పాటు అభివృదికి చేసిన కృషిని వివరించారు. రైతులు పంట నష్టపోతే పరిహారం ఇవ్వని దుర్మార్గుడు కేసీఆర్ అన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజితో 30 లక్షల నిరుద్యోగుల బతుకులను ఆగం చేసి రోడ్డు పడేసిందన్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో నానా గోస పెట్టి భార్యభర్తలు ఫోన్‌లో మాట్లాడుకోలేని పరిస్థితికి తీసుకువచ్చిందన్నారు. ఫోన్ ట్యాపింగ్ ప్రధాన నిందితుడు పంపే సొమ్ముతో కరీంనగర్‌లో కార్పొరేటర్లను, ప్రజాప్రతినిధులను కొనుగోలు చేస్తున్నారన్నారు. ఫోన్‌ట్యాపింగ్ నిందితుడి వియ్యంకుడితో కలిసి ఓ వ్యాపార వేత్త, మాజీ ప్రజా ప్రతినిధి కార్పొరేటర్లను కొంటున్నాడని ఆరోపించారు.



వాకర్స్‌తో కలిసి వాకింగ్ చేస్తూ ప్రచారం చేస్తున్న సంజయ్‌కుమార్

● ఫోన్ ట్యాపింగ్‌లో దొరికిన దొంగలు కేసీఆర్, కేటీఆర్

ఫోన్ ట్యాపింగ్‌లో దొరికిన దొంగలు కేసీఆర్, కేటీఆర్ అని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. ఆదివారం నగరంలోని కాపువాడలో మున్నూరు కాపు సంఘం నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్‌పై ఎందుకు విచారణ జరపడం లేదని, నిజాలు తెలిసినా వారిని ఎందుకు అరెస్టుచేయడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై తనను ఓడించేందుకు కుట్రలు చేస్తున్నాయన్నారు. సిరిసిల్ల కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్ వార్‌రూమ్‌ను ఏర్పాటు చేసుకుని తమ ఫోన్లను ట్యాప్ చేసినట్లు నిందితుడైన ప్రణీత్‌రావు చెప్పాడన్నారు. కేసీఆర్ చెబితేనే ఫోన్లను ట్యాప్ చేశామని రాధకిషన్‌రావు పోలీసుల విచారణలో వెల్లడించాడన్నారు. ఇంత స్పష్టమైన ఆధారాలున్నా కేసీఆర్, కేటీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కేసీఆర్‌తో కుమ్మక్కై కేసును నీరు గారుస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ దొంగ హామీలతో ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. తాను పక్కా లోకల్‌అని, కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులిద్దరూ నాన్ లోకల్ అన్నారు. మూడుపార్టీల్లోని ముగ్గురు అభ్యర్థులను బేరీజు వేసుకుని ఓటు వేయాలని కోరారు.



క్రికెట్ ఆడుతూ సందడి చేస్తున్న బండి సంజయ్‌కుమార్

ప్రజ్ఞ వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, మే 5: జెట్-వికాసతరంగిణి -108, వావిలాలపల్లి శాఖ ఆధ్వర్యంలో ప్రజ్ఞ వేసవి శిక్షణా శిబిరాన్ని ఆదివారం జ్యోతీనగర్‌లోని ఆండాళ్‌గోష్ఠిలో శాఖ చీఫ్ కో ఆర్డినేటర్ అరుణా భూపతిరావు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నైతిక విలువలను పెంపొందించే ఈ శిక్షణను వినియోగించుకోవాలని, నేర్చుకున్న అంశాలను ఆరచరణలో పెడుతూ అభివృద్ధి పథంలో పయనించాలని అన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 8 నుంచి 16 సంవత్సరాల బాలబాలికలు శిక్షణకు అర్హులని, శిక్షణలో శ్లోకాలు, కీర్తనలు, భజనలు, నైతిక కథలు, యోగ, ధ్యానం, పండు గల విశిష్ఠత, రామాయణ, భారత, భాగవతాల్లోని అంశాలు, ఋషుల చరిత్ర లు, ఆటలు నేర్పుతారని పేర్కొన్నారు. బాల బాలికలు పేర్లను ఆండాళ్‌గోష్ఠిలో నమోదు చేసుకోవాలని కోరారు.





దివ్యాంగులకు కుటుంబసభ్యుడిలా అండగా ఉంటా

- రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ముత్తినేని వీరయ్య

ధర్మపురి, మే 5: దివ్యాంగులకు కుటుంబసభ్యుడిలా ఎళ్లవేళలా అండగా ఉంటానని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. ధర్మపురి పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు, వితంతువులకు, వృద్ధులకు, గీత కార్మికులకు మొదట పెన్షన్ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయే అని ఆయన పేర్కొన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం హోం హాస్టల్‌లో, విద్యలో, ఉద్యోగంలో రిజర్వేషన్ ఇచ్చింది కాంగ్రెస్ అని ఆయన అన్నారు. కేసీఆర్ ఏనాడు సీఎం హోదాలో ప్రపంచ వికలాంగుల దినోత్సవానికి హాజరు కాలేదని ఆయన తెలిపారు. వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయకపోవడం వల్ల నిరుద్యోగ దివ్యాలాంగులు బొమ్మకంటి మహేందర్, రాగుల రామ్మోహన్ ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

వికలాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖను ఎత్తివేసి స్త్రీ శిశు సంక్షేమ శాఖలో విలీనం చేసిన చరిత్ర కేసీఆర్‌దేనని ఆయన అన్నారు. కేసీఆర్, బీజేపీ దివ్యాంగుల ద్రోహులని ఆయన తెలిపారు. పెరిక కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం గొప్ప నిర్ణయమని, అందుకే పెరికల కులస్థుల మద్దతు కాంగ్రెస్‌కు ఉంటుందని ఆయన అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా పెరిక కుల నాయకులు అంకతి గంగాధర్, రాందేని మొగిలి, ముద్దసాని అజయ్, అక్కుల లింగన్న, గోల్ల శ్రీకాంత్, రఘు, అనిల్, శరత్, శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.





విద్యార్థి, యువతను విస్మరించిన బీజేపీని ఓడించాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కసిరెడ్డి మణికంఠరెడ్డి

భగత్‌నగర్, మే 5: విద్యార్థి, యువతను విస్మరించిన బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో కరీంనగర్, సిద్దిపేట, సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల ఆఫీస్ బేరర్ల సమావేశం లో నిర్వహించారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడు తూ విద్యార్థులను బీజేపీ మతం పేరిట రెచ్చగొట్టడం తప్ప సంక్షేమానికి చేసిందేమీ లేదన్నారు. విద్యార్థి యువత పార్లమెంట్ ఎన్నికల్లో మార్పునకు సిద్ధం కావాలని ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, మచ్చ రమేష్, జేరిపోతుల జనార్ధన్, సంగెం మధు, అక్రమ్ ప్రీతం, రంజిత్, మామిడిపల్లి హేమంత్, కనకం సాగర్, సాయి అజాద్ పాల్గొన్నారు.

కారు ఢీకొని మహిళకు గాయాలు

చందుర్తి, మే 5: చందుర్తి మండల కేంద్రంలో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ ఆశీర్వాద సభకు హాజరై తిరిగి ఇంటికి వెళుతున్న మహిళలను కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం.. మండలంలోని ఎనగల్ గ్రామానికి చెందిన బుర్ర లచ్చవ్వ మల్యాలశివారులో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఆశీర్వాద సభకు ఆదివారం హాజరైంది. సభ ముగియడంతో రోడ్డుపైకి వచ్చింది. చందుర్తి వైపు వెళుతున్న కారు లచ్చవ్వను ఢీకొట్టడంతో కాలు విరిగింది. వేములవాడలోని ఏరియా ఆసుపత్రికి తరలించగా, అక్కడినుండి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు.

మద్యం పట్టివేత

వీణవంక, మే 5: మండలంలోని పోతిరెడ్డిపల్లిలో పంజాల కుమారస్వామి అనే వ్యక్తి అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని పోలీసులు ఆదివారం పట్టుకున్నాడు. కుమారస్వామి మద్యం విక్రయిస్తున్నాడని పక్కా సమాచారంతో తనిఖీ చేయగా సుమారు 16,120 రూపాయలు విలువ చేసే మద్యం పట్టుబడిందని పోలీసులు తెలిపారు. మద్యం స్వాధీనం చేసుకుని కుమారస్వామిని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై తిరుపతి తెలిపారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వాహనం తనిఖీ


ఆది శ్రీనివాస్ వాహనం తనిఖీ చేస్తున్న ఎన్నికల అధికారులు

వేములవాడ రూరల్, మే 5: ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వాహనాన్ని ఎన్నికల అధికారులు తనిఖీ చేసారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం వివిధ మండలాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొని వేములవాడకు తిరిగి వస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వాహనాన్ని మర్రిపల్లి వద్ద ఎన్నికల అధికారులు తనిఖీ చేసారు. తనిఖీలు నిర్వహించడానికి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులకు పూర్తిగా సహకరించారు.

రాష్ట్ర, జాతీయ స్థాయి తైక్వాండో క్రీడాకారులకు సన్మానం


క్రీడాకారులను సన్మానిస్తున్న అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 5: రాష్ట్ర, జాతీయ స్థాయి, అంతర యూనివర్సిటీ తైక్వాండో పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులను ఆదివారం ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ వివేకానంద విద్యానికేతన్‌లో కరీంనగర్ జిల్లా యాదవ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గెజిటెడ్ అధికారి శోభరాణి, వివేకానంద పాఠశాలల చైర్మన్ సొగాని కొమురయ్య, యాదవ ట్రస్టు అధ్యక్షుడు బబ్బురి కుమార్, బూస అంజయ్య పాల్గొని క్రీడాకారులు బబ్బురి అక్షిత, ప్రవళిక, ఎండి ఆస్మిన్, ఆఫియ, సుప్రియ, మహేశ్‌బాబు, హరి, హరిష్, తిరుమల్ కుమార్, రవీందర్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, ఉండాటి సిద్దులను శాలువా, మెమెంటోతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని తైక్వాండో క్రీడాకారులు జాతీయ, ఒలింపిక్ స్థాయి క్రీడల వరకు ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటేందుకు తైక్వాండో క్రీడాకారులకు మంచి శిక్షణ అందించాలన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ప్రశంసాపత్రాలను అందచేశారు. కార్యక్రమంలో యాదవ హక్కుల పోరాట సమితి బండి మల్లయ్య, జిల్లా అధ్యక్షుడు దుండ్ర రాజయ్య, టౌన్ అధ్యక్షుడు గాలి రవి, కర్ణాటకపు రాజయ్య, జంగ కొముకయ్య, మార్క వెంకటేశ్, బట్టి శంకర్ పాల్గొన్నారు.

సీఎస్ఐటీపీ ఎస్ఆర్‌బీవీపీ ఎన్నికలు

- ఉపాధ్యక్షుడిగా జి కృపాదానం ఎన్నిక



సీఎస్ఐటీపీ ఎస్ఆర్‌బీవీపీ ప్రతినిధులతో కృపాదానం

కరీంనగర్ కల్చరల్, మే 5: సీఎస్ఐటీపీ సౌత్ రీజియన్ బెన్ఫిషరీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా కరీంనగర్‌కు చెందిన గుండ్ర కృపాదానం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బెంగుళూరులో చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా ట్రస్టు అసోసియేషన్ బెన్ఫిషరీ వెల్ఫేర్ అసోసియేషన్ సౌత్ రీజియన్ బాడీ ఎన్నికలు ఆదివారం జరుగగా అధ్యక్షుడిగా బీసి రవిచంద్రన్ (తమిళనాడు), ఉపాధ్యక్షుడిగా జి.కృపాదానం (తెలంగాణ), తెలంగాణ రీజియన్ ప్రధాన కార్యదర్శిగా జయపాల్ జయకుమార్ (తమిళనాడు), రాష్ట్ర ఉపకార్యదర్శిగా స్టాలిన్ (కర్ణాటక), కోశాధికారిగా ఏబెల్ (కర్ణాటక) ఎన్నిక కాగా తెలంగాణ రాష్ట్ర బాధ్యులుగా కొత్త విద్యాసాగర్ (హైదరాబాద్), అనిల్‌రాజ్ (మంచిర్యాల), జయపాల్ (వరంగల్) వి జాన్సన్ (కరీంనగర్) ఎన్నికయ్యారు. వీరంతా మూడు సంవత్సరాల పాటు పదవిలో ఉంటారు.

నేడు కరీంనగర్‌కు సీపీఐ జాతీయ కార్యదర్శి రాక

భగత్‌నగర్, మే 5: సోమవారం కరీంనగర్‌కు సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి రానున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌లోని పద్మనాయక కళ్యాణ మండపంలో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు నియోజకవర్గాల సీపీఐ గ్రామశాఖ, మండల కార్యదర్శిల, జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సభ్యుల ప్రజాసంఘాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఇండియా కూటమిలో సీపీఐ భాగస్వామిగా ఉన్నందున కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల గెలుపు కోసం సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సీపీఐ శ్రేణులు సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మానవత్వం చాటుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్


రోడ్డుపై గాయాలతో పడి ఉన్న వ్యక్తి

కరీంనగర్ క్రైం, మే 5: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తన మానవత్వాన్ని చాటుకున్నారు. హుజురాబాద్ నుంచి ఎన్నికల ప్రచారాన్ని పూర్తి చేసుకొని కరీంనగర్ వెళ్తున్నారు. మార్గమధ్యంలో మానకొండూర్ మండలం సదాశివపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని అపస్మారక స్థితిలో ఓ వ్యక్తి పడి ఉన్నాడు. వెంటనే పొన్నం ప్రభాకర్ తన కాన్వాయ్‌ను నిలిపివేసి గాయపడ్డ వ్యక్తి పరిస్థితిని సిబ్బందితో కలిసి పరిశీలించారు. అంబులెన్స్ వచ్చేలోపు తన వాహనంలో గాయపడ్డ వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. అనంతరం గాయపడ్డ వ్యక్తి వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గాయపడ్డ వ్యక్తిని ఆసుపత్రికి తరలించిన తరువాత మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. దీంతో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను అటుగా వెళ్తున్న ప్రయాణికులు కొనియాడారు.


గాయపడిన వ్యక్తిని తన వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న మంత్రి పొన్నం

వెలగని ఎల్ఈడీ లైట్లు

- పట్టించుకోని కాంట్రాక్టర్...అధికారులు


జగిత్యాలలో వెలగని లైట్లు

జగిత్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో రహదారి మ ధ్యన సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు ఏర్పాటు చేసిన ఎల్ఈడీ లైటింగ్ స్ట్రిప్స్ వెల గకుండా పోయాయి. కాసులకు కక్కుర్తి పడిన కాంట్రాక్టర్లు, అధికారులు నిర్లక్ష్యం కారణంగా నాణ్యత లోపంతో వాటర్ ప్రూఫ్ ఎల్ఈడీ స్ట్రిప్స్ ఏర్పాటు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత యేడాది జూన్ మాసంలో పట్టణ ప్రగతి నిధు లతో సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు ఎల్ఈడీ లైట్ స్ట్రిప్స్‌ను ఏర్పాటు చేశారు. సు మారు రూ. 16.90 లక్షలతో పట్టణ శివారులోని దరూర్ గ్రామ శివారు నుంచి కొత్త బస్టాండు చౌరస్తా మీదుగా మంచినీళ్ల బావి వరకు రహదారి మధ్యన సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు ఎల్ఈడీ లైటింగ్ స్ట్రిప్స్‌ను ఏర్పరిచారు. ఒక్కో స్తంభా నికి కనీసం సుమారు 50 మీటర్ల పొడవుతో వాటర్ ప్రూఫ్ లైటింగ్ అమరిచారు. సంవత్సర కాలం పాటు వీటి పనితీరును చూడాల్సిన బాధ్యత సంబంధిత కాం ట్రాక్టరుకు అధికారులు అప్పగించారు. నాణ్యత లోపంతో ఏర్పాటు చేయడం కార ణంగా కొన్ని రోజులుగా స్ట్రిప్స్ పనిచేయడం లేదు. కాంట్రాక్టర్‌ను అధికారులు ప్ర శ్నించకపోవడం, పాలకవర్గంలో చోటుచేసుకున్న మార్పులు కారణంగా స్ట్రిప్స్ పు నరుద్ధరణ జరగడం లేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారు లు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని లైటింగ్ స్ట్రిప్స్ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ఆటో డ్రైవర్ మృతి

- వైద్యుడు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన
- ఆస్పత్రి సామగ్రి ధ్వంసం.. వైద్యుడిపై దాడి
- కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉద్రిక్తం


ఆటోను అడుకుంటున్న ఆందోళనకారులు(ఇన్‌సెట్‌లో మృతి చెందిన రహిమాన్)

కోరుట్ల, మే 5 : పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరిన ఓ ఆటో డ్రైవర్ ఆదివారం మృతి చెందడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. ఆస్పత్రి సిబ్బంది, వైద్యుడి నిర్లక్ష్యంతోనే మృతి చెందాడంటూ మృతుడి బంధువులు ఆందోళన చేపట్టారు. ఆగ్రహంతో ఫర్నీచర్‌ను ధ్వంసం చేసి వైద్యుడిపై దాడి చేయడంతో ఆస్పత్రి వద్ద ఉ ద్రిక్త పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలం చేరు కుని అదుపు చేయడానికి ప్రయత్నించినప్పటికి వారిపై దురుసుగా ప్రవ ర్తించడంతో పరిస్థితి అదుపు తప్పింది. బంధువులు తెలిపిన వివ రాల ప్రకారం పట్టణంలోని హాజీ పుర ప్రాంతానికి చెందిన నజిబుల్ రహిమాన్ అలియాస్ ఆటో ముజీబ్ (49) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం కొత్త బస్టాండ్ ఆటో స్టాం డ్ వద్ద ఉన్నట్టుండి సోమసిల్లి పడిపోయాడు. గమనించిన ఆటో యూనియన్ సభ్యు లు రహిమాన్‌ను పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి బంధువులు సమాచా రం అందించారు. ఆసుపత్రిలో ఉన్న సిబ్బంది రహిమాన్‌కు ప్రథమ చికిత్స చేసి వి ధుల్లో ఉన్న వైద్యుడికి సమాచారం అందించారు. చాలా సమయం తరువాత ఆస్ప త్రికి చేరుకున్న వైద్యుడు రహిమాన్‌ను చికిత్స చేసేందుకు ప్రయత్నించేలోపే రహి మాన్ అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందాడు. రహిమాన్ మృతి విషయం తెలు సుకున్న బంధువులు, మిత్రులు వైద్యుడితో పాటు సిబ్బందిని నిలదీసారు. ఆగ్రహంతో ఆస్పత్రిలో ఉన్న ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. భయాందోళనకు గురైన డాక్టర్, సిబ్బం ది అక్కడే ఉన్న గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నారు. దీంతో కోపోద్రులైన బంధువులు, తలుపులను బద్దలు కొట్టే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న కథలాపూర్ ఎస్ఐ నవీన్ తన సిబ్బందితో అక్కడి చేరుకుని అందోళన కారులను సమాదాయించే ప్రయత్నం చేసినా వారిపై బంధువులు దురుసుగా ప్రవర్తించారు. కోపోద్రులైన రహి మాన్ మిత్రులు తమతో తచ్చుకున్న కిరోసిన్ అసుపత్రిలో చల్లి అంటించే ప్రయత్నం చేసారు. గమనించిన పోలీసులు వారించి అక్కడి నుంచి చెదరగొట్టారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆస్పత్రి వద్దకు పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో మరింత ఉద్రిక్తత నెలకొంది. డ్యూటీలో ఉన్న వైద్యుడు బయటకు రావాలని ఆందోళనా కారులు పట్టుబట్టారు. దీంతో పోలీసులు వైద్యుడిని పోలీసులు స్టేషన్‌కు ఆటోలో తరలిస్తుండగా ఆటోను అడ్డుకునా వైద్యుడిపై దాడి చేశారు. వెంటనే పోలీ సులు వారించి ఎట్టకేలకు పోలీసు స్టేషన్‌కు తరలించారు. రహిమాన్ మృత దేహంతో బంధువులు ఆసుపత్రి ఆవరణలో ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం పోలీసు ఉన్నతాధికారుల వరకు వెళ్లడంతో మెట్‌పల్లి డీ ఎస్పీ ఉమామహేశ్వర్ రావు కోరుట్ల సీఐ సురేష్ బాబు, మేడిపల్లి, మెట్‌పల్లి ఎస్ఐ శ్యాంరాజు, చిరంజీవి సంఘటన స్థలం వద్దకు చేరుకుని పరిస్థితి సమీక్షించారు. విచారణ చేపట్టి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. రహిమాన్ ఎండ తీవ్రత్తకు మృతి చెంది ఉంటాడని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇదిలా ఉండగా రహిమాన్ భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నాడు. పెద్ద కూతురు వివాహం ఈ నెల 17వ తేదీన ఉన్నట్లు బంధువులు తెలిపారు.

విరిగిపడిన వృక్షం

- మూడు వాహనాలు ధ్వంసం


ధ్వంసమైన వాహనం

వేములవాడ, మే 5 : వేములవాడ పట్టణంలోని పార్వతీపురం వసతి గదుల వెనుక భాగంలో గల వీఐపీ రోడ్డులో ఆదివారం నాడు చెట్టు విరిగి పడిన ఘటనలో మూడు వాహనాలు ధ్వంసం అయ్యాయి. నటరాజ విగ్రహం నుండి గుడి చెరువుకు వెళ్లే మార్గంలోని విఐపి రోడ్డులో ఏండ్ల నాటి చింత చెట్టు కింది భాగం మొత్తం పుచ్చిపోయి ఆదివారం నాడు ఒకసారిగా కుప్పకూలి పడిపో యింది. చెట్టు నీడ ఉండడంతో అక్కడ పార్కు చేసి ఉంచిన వాహనాలపై పడడంతో పాక్షికంగా ధ్వంసమయ్యాయి. పోలీస్ శాఖకు చెందిన డాగ్ స్క్వాడ్ సిబ్బంది అదే సమయంలో అక్కడికి చేరుకుని వాహనం నుంచి దిగి ప్రధాని పర్యటన నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తుండగా, రోడ్డు మధ్యలో ఉన్న పోలీసు వాహనంపై పడడంతో వాహనం ధ్వంసం అయింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఉద్యోగం లేదని మనస్తాపం..

యువకుడి ఆత్మహత్య


లవన్‌కుమార్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మే 5: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన ఆకుల లవన్‌కుమార్(25) ఉద్యోగం లేదనే మనస్తాపంతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన లవన్ కుమార్ హైదరాబాద్‌లో ఇటీవల ఎంబీఏ పూర్తి చేశాడు. ఉద్యోగం లేకపోవడంతో ఇంటి వద్ద ఉంటున్నాడు. గత నెల 7న పక్కింటివారి కూలర్ తన ఇంటికి తీసుకొచ్చాడు. కూలర్ ఎందుకు తీసుకొచ్చావంటూ తల్లి మందలించింది. దీంతో అదే రోజు రాత్రి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు వెళ్లాడు. ఉద్యోగం లేదని బాధపడుతూ అప్పటి నుంచి తల్లితో ఫోన్ సరిగా మాట్లాడడం లేదు. ఆదివారం ఉదయం బొప్పాపూర్ గ్రామ సమీపంలోని జక్కుల చెరువు వద్ద ద్విచక్ర వాహనం, చెప్పులను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. చెరువులో మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు స్థానికుల సహాయంతో బయటకు తీశారు. చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుని కాగా లవన్‌కుమార్ తల్లి తన కొడుకు మృతిపై అనుమానం వ్యక్తం చేసింది. తల్లి వనజ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ పేర్కొన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణకు చర్యలేవి

- దాహార్తి తీరక వన్య ప్రాణులు విలవిల


మరిమడ్లలో ఖాళీగా ఉన్న నీటి తొట్టిలు

కోనరావుపేట, మే 5: వన్యప్రాణులను సంరక్షించాలని అధికారులు చెబుతున్నప్పటికీ అటవీ శాఖ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వేసవిలో వన్యప్రాణులు దాహార్తి తీర్చుకోవడానికి అటవీ ప్రాంతం నుండి జనవాసంలోకి వచ్చి కుక్కల దాడిలో మృతి చెందుతున్నాయి. అడవి జంతువులను కాపాడడానికి అడవి ప్రాంతంలో నీటి తొట్టిలను అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. కానీ వాటిలో నీటిని నింపకపోవడంతో వన్యప్రాణులు దాహార్తి తీర్చుకోవడం కోసం ఇబ్బందులు పడుతున్నాయి. నీటి తొట్టిలను ఏర్పాటు చేసిన సమయంలో నీళ్లు నింపి మళ్లీ నీళ్లు పోయకపోవడంతో వేసవిలో అడవి జంతువులకు ఇబ్బందులు తప్పడం లేదు. కోనరావుపేట మండలంలోని శివంగాలపల్లి, మరిమడ్ల అటవీ ప్రాంతాల్లో అటవీ శాఖ అధికారులు నీటి తొట్టిలను ఏర్పాటు చేశారు. కానీ వాటిలో అధికారులు నీరు నింపడంలో మర్చిపోయారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు నీటి తొట్టిలో నీరు నింపాలని ప్రజలు కోరుతున్నారు.

'సన్'డే

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దంచి కొడుతున్న ఎండలు
- జగిత్యాల జిల్లా వెల్గటూరులో రాష్ట్రంలోనే అత్యధికంగా 47.1 డిగ్రీలు
- పలు చోట్ల 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


జన సంచారం లేక వెల వెలబోతున్న వీణవంక బస్టాండు ప్రాంతం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. పలుచోట్ల 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం తొమ్మిది గంటల వరకే ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.

జగిత్యాల టౌన్, మే 5: రెండు, మూడు రోజులుగా జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోతున్నాయి. జిల్లాలో ఆదివారం రాష్ట్రంలోనే అత్యధికంగా వెల్గటూర్ మండల కేంద్రంలో 47.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇబ్రహీంపట్నం మండలం గోధూర్‌లో 46.8, రాయికల్ మండలం అల్లీపూర్‌లో 46.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మరో ఎనిమిది ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో వాతవరణ శాఖ వరుసగా రెండో రోజు జిల్లాను రెడ్ అలర్ట్‌గా ప్రకటించింది. అవసరమైతే తప్పా బయటకు వెళ్లవద్దని, అత్యవసర పరిస్థితుల్లో జాగ్రత్తలు పాటించాలని పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ధర్మపురి మండలం బుద్దేశ్‌పల్లిలో 45.6, వెల్గటూర్ మండలం గుల్లకోట, ధర్మపురి మండలం జైనలో 45.5 డిగ్రీలు, బీర్‌పూర్ మండలం కొల్వాయిలో 45.3, రాయికల్ మండల కేంద్రంలో 45.1, మెట్‌పెల్లి పట్టణంలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో రాత్రి 10 దాటిన తర్వాత కూడా ఉక్కపోతలు తప్పకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.


జగిత్యాలలో తలకి రుమాలు కట్టుకుని వెళుతున్న ప్రయాణికులు


గొడుగు పట్టుకుని దోసకాయలు విక్రయిస్తున్న మహిళ

● **వీణవంక:** మండలంలో వరుసగా నాలుగో రోజు ఉష్ణోగ్రతలు తగ్గలేదు. ఆదివారం మండలంలో 46.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైంది. ప్రతి రోజు ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదు కావడంతో వీణవంక బస్టాండ్ ప్రాంతం జన సంచారం లేక వెలవెలబోయింది.

● **సిరిసిల్ల:** వడగాలులు, ఎండ తీవ్రతతో ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సెలవు దినం కావడంతో అందరూ ఇళ్లకే పరిమితం అయ్యారు. జన సంచారం లేక జిల్లా కేంద్రంలోని రోడ్లు వెలవెలబోయాయి. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఉష్ణోగ్రత 44.7, చందుర్తిలో 44.6, ఇల్లంతకుంటలో 44.3, గంభీరావుపేటలో 44.1, వేములవాడలో 44, వీర్నపల్లిలో 43.9, వేములవాడ రూరల్‌లో 43.9, బోయినపల్లిలో 43.7, తంగళ్లపల్లిలో 43.4, రుద్రంగిలో 43.4, ఎల్లారెడ్డిపేటలో 42.9, కోనరావుపేటలో 42.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

విద్యారంగాన్ని పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి


మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 5: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. ఆదివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ధనవంతుల కొమ్ముకాస్తుందన్నారు. అదానీ, అంబానీల అప్పులను మాఫీ చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రం నుంచి లక్షల రూపాయలు టాక్స్‌ల రూపంలో తీసుకున్న కేంద్రం అంతర్జాతీయ ప్రామాణాలతో ఒక్క ఆసుపత్రిని కూడా నిర్మించలేదన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంలో విఫలమయ్యారని విమర్శించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి విస్మరించారన్నారు. జనాభాలో 60 శాతం ఉన్న బీసీల కుల గణన చేయాలని కోరితే బీజేపీ వ్యతిరేకించిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వ్యతిరేకమని ఆరోపించారు. అనంతరం ప్రొఫెసర్లు పద్మజ, లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మోదీ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈ సమావేశంలో కొరివి వేణుగోపాల్, కందుకూరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

● విభజన రాజకీయాలు చేస్తున్న బీజేపీ

విద్వేష, విభజన రాజకీయాలు చేస్తున్న బీజేపీని ఓడించాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. ఆదివారం నగరంలోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్‌తో మాట్లాడారు. అనంతరం రైతుబజార్‌లో జాగో తెలంగాణ, తెలంగాణ ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నైనాల గోవర్ధన్, రాయిదాస్ రాయ్, మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం హన్మేశ్, కొరివి వేణుగోపాల్, పిడిఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి శ్రీకాంత్, డిబిఎఫ్ పులి కల్పన, స్వరూప, సౌజన్య, రాణా ప్రతాప్, అంజి, తిరుపతి, కుమారి, గౌస్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

● బీజేపీతో రాజ్యాంగానికి ముప్పు

మానకొండూర్, మే 5: కేంద్రంలో మరోసారి మోదీ సర్కార్ అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి ముప్పు వాటిల్లుతుందని మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. ఆకునూరి మురళి ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర ఐదో రోజు ఆదివారం మానకొండూర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంకుశ కేసీఆర్ పాలనను తెలంగాణ ప్రజలు ఓడించారని అన్నారు. 2014 లో జరిగిన ఎన్నిక సందర్భంగా నరేంద్ర మోదీ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారం చేపట్టినా దాని ఊసే లేదని విమర్శించారు. 2018లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకాన్ని ప్రవేశపెట్టి ఇల్లు లేని నిరుపేదలందరికీ సొంత గృహం ఉండేలా చూస్తామని చెప్పారని తెలిపారు. బీజేపీకి 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని ఆపార్టీ నేతలు బహిరంగంగానే మాట్లాడుతున్నారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలు బీజేపీకి ఓటు వేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బస్సుయాత్ర బృందం సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి


మనోహర్(ఫైల్)

కరీంనగర్ క్రైం, మే 5 : కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లి బస్టాండ్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగాధర మండలం చర్లపల్లికి చెందిన దయ్యాల మనోహర్(23) చెందాడని పోలీసులు తెలిపారు. మనోహర్ చొప్పదండి నుంచి గంగాధరకు బైక్‌పై వెళ్తుండగా తీగలగుట్టపల్లి బస్టాండ్ వద్ద ఆగి ఉన్న కారును వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో కారు పక్కన నిలుచున్న ముగ్గురు వ్యక్తులకు గాయాలు కాగా మనోహర్ తలకు తీవ్రగాయాలయ్యాయి. మనోహర్‌ను ఆసుపత్రికి తరలించగా ఆదివారం ఉదయం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణ మైన రోడ్డుపై పార్క్ చేసిన కారు యజమానిపై చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి మల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బెదిరింపులకు పాల్పడిన ఇద్దరిపై కేసు

జమ్మికుంట రూరల్, మే 5: ఇళ్లు, ఖాళీ స్థలం అమ్ముతామని నమ్మబలికి ఓ మహిళ వద్ద డబ్బులు తీసుకొని బెదిరింపులకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులపై పోలీస్‌లు ఆదివారం కేసు నమోదు చేశారు. జమ్మికుంటకు చెందిన రావుల తిరుపతి, రావుల రాజేందర్ అనే వ్యక్తులు హుజూరాబాద్ మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన బెల్లం వసంతకు ఇళ్లు, 30గుంటల ఖాళీ స్థలం అమ్ముతామని చెప్పి పథకం ప్రకారం డబ్బులు వసూళ్లు చేశారు. తీరా రిజిస్ట్రేషన్ సమయం వచ్చే సరికి ఏం చేసుకుంటారో చేసుకో అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసిందని, ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన ఒకరిపై కేసు

వీణవంక, మే 5:మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆత్మీయ సమ్మేళనం ముగించుకొని జగిత్యాల సభకు బయలు దేరి వెళ్తుండగా భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా అనుమతి లేకుండా బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఏజెంటు మొలుగు పూర్ణచందర్ టపాకాయిలు కాల్చినందుకు ఎఫ్ఎస్‌టీటీం (ఎన్నికల అధికారి)ఇన్‌చార్జి నగరీతి రాంకూమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పూర్ణచందర్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్సై సూచించారు.

మరమగ్గాల కార్మికులకు యారన్ సబ్సిడీలను అందించాలి


సిరిసిల్లలో మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, మే 5: సిరిసిల్లలో బతుకమ్మ చీరలను తయారు చేసిన మరమగ్గాల కార్మికులకు రావాల్సిన పది శాతం యారన్ సబ్సిడీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అందించాలని సీఐటీయూ తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్ భద్రావతి సొసైటీ వద్ద ఆదివారం సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ వార్డుల ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరమగ్గాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పెద్ద ఎత్తున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవడంలో భాగంగా ఈ నెల 8వ తేదీన సాయంత్రం 4గంటలకు నేహ్రూనగర్‌లోని భవాని ఫంక్షన్‌హాల్‌లో మరమగ్గాల కార్మికుల విస్తృత స్థాయి సమావేశాన్నిఏర్పాటు చేశామని చెప్పారు. ప్రస్తుతం జరిగబోయే పార్లమెంట్ ఎన్నికలల్లో కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీని ఓడించాలని కార్మిక చట్టాలు హక్కుల రక్షణ కోసం ఇండియా కూటమిలో భాగస్వామి అయిన కాంగ్రెస్ కూటమికి పవర్‌లూం వర్కర్స్ యూనియన్ పూర్తిస్థాయిలో మద్దతు తెలుపుతోందని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, నాయకులు గుండు రమేష్, సబ్బని చంద్రకాంత్, కంది మల్లేశం, బెజుగం సురేష్, సదానందం, దశరథం, దామోదర్, గణేష్, విజయ్, ప్రసాద్, తిరుపతి, పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో ఇద్దరి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

జమ్మికుంట/ఇల్లందకుంట, మే 5: జమ్మికుంట పరిధిలో వేర్వేరు చోట్లు ఆదివారం వడ దెబ్బ తగిలి ముగ్గురు మృతి చెందారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో గల ఆదర్శనగర్ రైల్వే ట్రాక్ పక్కన ఓ వ్యక్తి ఎండ తీవ్రతతో ఆదివారం మృత్యువాత పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఇల్లందకుంట మండలం చిన్నకోమటిపల్లి గ్రామానికి చెందిన మూడెడ్ల రాజయ్య (50) మతి స్థిమితం కోల్పోయి వారం రోజుల క్రితం ఇంటి నుండి బయ టకు వచ్చాడు. ఊరూరా భిక్షాటన చేస్తూ, కొత్తపల్లిలోని రైల్వే ట్రాక్ పక్కన ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు ఏరుకుంటున్నాడు. కాగా ఆదివారం రైల్వే ట్రాక్ పక్కన మృత్యువాత పడి ఉన్నాడు. ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లగా, ఎండ తీవ్రతతో మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు. కాగా జమ్మి కుంట రైల్వే స్టేషన్‌లోని ఫస్ట్ ప్లాట్ ఫారమ్‌పై గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. మృతుడి వయస్సు 50- 60సంవత్సరాల మధ్య ఉంటుంది. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు, గుర్తింపు కార్డులు లభించలేదు. అనారోగ్యం, వడ దెబ్బతో మృతి చెంది ఉంటాడని రైల్వే పోలీస్ లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని జమ్మికుంట ప్రభు త్వ ఆస్పత్రిలో భద్ర పరిచినట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ధర్మారం, మే 5: ధర్మారం మండలం బంజేరుపల్లిలో కల్లోల వెంకయ్య(40) అనే వ్యక్తి శనివారం రాత్రి మద్యం మత్తులో విషగుళికలు మింగగా, కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా జలదంకి మండల కేంద్రానికి చెందిన వెంకయ్య 15రోజుల క్రితం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం బంజేరుపల్లి గ్రామంలో భవన నిర్మాణాలకు కూలి పని చేయడానికి వచ్చాడు. శనివారం రాత్రి వెంకయ్య మద్యం తాగిన మత్తులో విష గుళికలు మింగాడు. అతని కరీంనగర్ ఆసుపత్రికి తరలింగా చికిత్స పొందుతూ అదేరాత్రి మృతిచెందాడని మృతుడి భార్య వెంగమ్మ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

వీణవంకలో యువకుడు..

వీణవంక, మే 5: పురుగుల మందు తాగిన మండలంలోని కోర్కల్ గ్రామానికి చెందిన పూదరి కుమార్ (38) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం.. కుమార్ కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. తరుచూ తనకు పెళ్లి కావడం లేదని తెలిసిన వారితో చెప్పుకుంటూ బాధప డేవాడు. మనస్తాపం చెందిన కుమార్ శనివారం పురుగుల మందు తాగాడు. స్థానికులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతు మృతి చెందాడు. కుమార్ తల్లి పూదరి ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకిరికి తీవ్రగాయాలు

మానకొండూర్, మే 5: మండలం ముంజంపల్లి శివారులో గల జాలగుట్ట వద్ద ఆదివారం మోటార్ సైకిలిస్టు అదుపు తప్పి పడిపోయిన సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన ఓరుగంటి సురేష్ అనే వ్యక్తి వ్యక్తి గత పనిపై మోటార్ సైకిల్‌పై కరీంనగర్‌కు వెల్లుతున్నాడు. జాలగుట్ట వద్ద అదుపుతప్పిపడిపోవడంతో తీవ్రగాయలు అయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

ప్రశాంతంగా నీట్ ప్రవేశ పరీక్ష

- జిల్లాలో 5 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- 3,466 మంది విద్యార్థులు హాజరు


పరీక్ష రాసేందుకు క్యూ లైన్‌లో వెళుతున్న విద్యార్థులు

తిమ్మాపూర్, మే 5: దేశవ్యాప్తంగా వైద్య, విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్(నీట్ ప్రవేశ పరీక్ష) ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నీట్‌పరీక్ష కోసం జిల్లా వ్యాప్తంగా 5 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కరీంనగర్‌లోని వివేకానంద రెసిడెన్షియల్ పాఠశాలలో 828 మంది విద్యార్థులకు గాను 811 మంది హాజరయ్యారు. వివేకనంద డిగ్రీ, పీజీ కాలేజీలో 792 మందికి గానూ 778 మంది, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 480 మందికి గానూ 469 మంది పరీక్ష రాశారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని శ్రీ చైతన్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్సెస్ పరీక్ష కేంద్రంలో 720 మందికి 706 మంది, వాగేశ్వరి కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ పరీక్ష కేంద్రంలో 720 మందికి 702 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మొత్తంగా జిల్లా వ్యాప్తంగా 3,540 మంది విద్యార్థులకు గానూ 3,466 మంది పరీక్ష రాశారు. కాగా 74 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని నీట్ అర్హత పరీక్ష సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ టి లలితాకుమారి తెలిపారు. ఈ పరీక్ష మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5.20గంటల వరకు ఒకే షిఫ్టులో పెన్ను పేపర్ విధానంతో నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. ఒక్క నిమిషం నిబంధన కారణంగా పరీక్షకు ఆరగంట ముందు నుంచే విద్యార్థులను లోనికి అనుమతిం చలేదు. తమ వెంట పాస్‌పోర్ట్ సైజు ఫోటోను అతికించిన అడ్మిట్ కార్డు, ఏదైనా గుర్తింపు కార్డు ఉంటేనే అభ్యర్థులను లోనికి అనుమ తించారు. ఫోటోలు వెంట తీసుకురాని కొందరికి పరీక్ష కేంద్రాల్లోనే అందజేసే ఏర్పాటు చేశారు. గుర్తింపు కార్డు వెంట తీసుకురాని ఒకరిద్దరిని పరీక్ష రాసేందుకు అనుమతించలేదు. మొబైల్‌తో సహా ఇతర ఎలాక్ట్రానిక్ వస్తువులను, షూస్ వంటి వాటిని అధికారులు పరీక్ష కేంద్రాంలోనికి అనుమ తించలేదు. ఏండలు తీవ్రంగా ఉన్నప్పటికీ పరీక్షా కేంద్రాల్లో ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.


రూం నంబరు చూసుకుంటున్న విద్యార్థులు

రిజర్వేషన్లు రద్దు చేసే ప్రసక్తేలేదు

-బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్


గంగాధరలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్

గంగాధర, మే 5: రిజర్వేషన్ల రద్దుపై కాంగ్రెస్ విషప్రచారం చేస్తోందని, భగవంతుడి సాక్షిగా చెపుతున్నా వాటిని రద్దు చేసే ప్రసక్తే లేదని బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ అన్నారు. ఆదివారం చొప్పదండి నియోజకవర్గ స్థాయి కార్నర్ మీటింగ్ గంగాధర మండలం మధురానగర్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా సంజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయలేక మోడీపై సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు చేస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు పోరాడుదామని అన్నారు. దేశాన్ని ప్రపంచంలో ఉన్నతంగా నిలబెట్టిన ప్రధాని మోడీపై సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. సీఎం స్థాయి వ్యక్తి రిజర్వేషన్లపై పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎంపీగా కేంద్రం నుండి 12వేల కోట్ల నిధులతో అభివృద్ధి చేశానన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఎన్నికలప్పుడు తప్ప కనిపించరని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు సుద్దాల దేవయ్య, పెద్దిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, నియోజకవర్గ కన్వీనర్ పెరుక శ్రవణ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దూళం కళ్యాణ్‌గౌడ్, వినయ్ సాగర్, క్రిష్టారెడ్డి, విద్యాసాగర్,ఆరు మండలాల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

●భగత్‌నగర్: కరోనా కష్ట కాలంలో ప్రజల ప్రాణాలు కాపాడిందిన గ్రామీణ వైద్యులే అని బీజేపీ జాతీయప్రధాన కార్యదర్శి, బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని రాజశ్రీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన గ్రామీణ ప్రాంత ఆర్ఎంపీ, పీఎంపిల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలు ఆరోగ్య కరమైన వాతావరణంలో ఉంటున్నాయంటే ఆర్ఎంపీలు, పిఎంపిలే కారణమన్నారు. ఈ సందర్భంగా ఆర్ఎంపి, పిఎంపీల ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకులు బండి సంజయ్‌కుమార్‌కుమద్ధతు ప్రకటించారు.

●తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్ బయటపడే రోజు వస్తుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కరండ్ల మధూకర్ అన్నారు. ఆదివారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి ఫేక్ వీడియో క్రియేట్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారన్నారు. ఎన్డీయే కూటమికి 400 సీట్లు గెలవడం ఖాయమన్నారు.

●వైశ్యుడైన హోమ్ మినిస్టర్ అమిత్‌షాను కాంగ్రెస్ పార్టీ నేతలు అసభ్య పదజాలంతో అవమానించారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని వైశ్య భవన్‌లో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ దేశం రక్షించబడాలంటే అభివృద్ధి చెందాలంటే మోడీ ప్రధాని కావాల్సిన అవశ్యకతుందన్నారు. సర్జికల్‌స్ట్రైక్‌తో పాకిస్తాన్‌ను పరిగెత్తించిన చరిత్ర మోదీదన్నారు. దేశ ప్రధానిని నిర్ణయించే ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి ప్రధాని అభ్యర్థి లేదన్నారు. బిఆర్ఎస్‌కు ఓటేసినా ఒరిగేదేమన్నారు. ప్రసాదం స్కీం కింద కొండగట్టు, వేముల ఆలయాలకు అభివృద్ధి చేస్తానని లేఖ రాస్తే కేసీఆర్ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదన్నారు. గడీల రాజ్యం పోవడానికి నిద్రాహారాలు మాని పోరాటం చేశానని కేసులతో జైలు పాలయ్యాయన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తుందన్నారు.

వినోద్‌కుమార్‌ను గెలిపించాలి

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు మద్దతుగా నాయకుల ప్రచారం


జ్యోతినగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బోయినపల్లి వినోద్‌కుమార్ సతీమణి మాధవి

కరీంనగర్ టౌన్, మే 5: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా నగరంలోని పలు డివిజన్లలో పార్టీశ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జ్యోతినగర్‌లో వినోద్‌కుమార్ సతీమణి మాధవి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సతీమణి గంగుల రజిత, కార్పొరేటర్ గందె మాధవి మహేశ్‌తో కలిసి విస్తృత ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ఎంపీగా వినోద్‌కుమార్ చేసిన అభివృద్ధి పనులు, బీఆర్ఎస్ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, మళ్లీ గెలిపిస్తే కరీంనగర్ అభివృద్ధికి పాటుపడతానని చేసిన హామీలతోకూడిన కరపత్రాన్ని ఓటర్లకు పంపిణీ చేస్తూ మరోసారి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. అలాగే మేయర్ యాదగిరి సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్, కార్పొరేటర్లు, డివిజన్, బూత్ ఇంచార్జీలు ఇంటింటికి వెళ్లి వినోద్‌కుమార్‌కు ఓటు వేయాలని కోరుతూ కరపత్రాలను పంపిణీచేశారు.

●కరీంనగర్ రూరల్: వినోద్‌కుమార్‌ను గెలిపించాలని మండలంలో పలు గ్రామాల్లో టీఆర్ఎస్ శ్రేణులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. దుర్శేడ్ గ్రామంలో మాజీ ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చెర్లబూత్కూర్‌లో మండల శాఖ అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పూదరి మహేష్, పొలగాని గట్టయ్య, పొలగాని అంజయ్య, కరుణాకర్, జాగిరి మహేష్, గంగయ్య పాల్గొన్నారు.

●భగత్‌నగర్: కొత్తపల్లి పట్టణంలో మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు గండు రాంబాబు, గున్నాల విజయరమేష్, చింతల సత్యనారాయణరెడ్డి, జేరిపోతుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

●తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలో ఆదివారం రాత్రి వినోద్ కుమార్‌కు మద్దతుగా బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రావుల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

●వినోద్ కుమార్‌కు కుటుంబం కంటే ప్రజలే ముఖ్యమని, అలాంటి నాయకుడిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్ కోడలు డాక్టర్ హర్షిని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు జివి.రామకృష్ణారావు, మండల బీఆర్ఎస్ అధ్యక్షులు రావుల రమేష్, జడ్పీటీసీ ఇనుకొండ శైలజ జితేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ఇతర నాయకులు, బిఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

●చిగురుమామిడి: బోయినిపల్లి వినోద్‌కుమార్ విజయం ఖాయమని ఎంపీపీ కొత్త వినిత-శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఇంటింటా తిరుగుతు జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ వినోద్‌కుమార్‌ను ఎంపీగా గెలిపిస్తే మన సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాడని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, మాజీ వైస్ ఎంపీపీ అకవారం బావాణి-ప్రసాద్, మాజీ ఉపసర్పంచ్ ముక్కెర పద్మ-సదానందం పాల్గొన్నారు.

'పోలింగ్ శాతం పెంచేందుకు కృషి చేయాలి'

భగత్‌నగర్, మే 5: ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారికి బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ విజ్ఞప్తిచేశారు. వేసవి కాలం కారణంగా పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ శాతం తగ్గే అవకాశం ఉందని, మే 13వ తేదీ కంటే ముందు రెండో శనివారం, ఆదివారం కావడంతో మూడు రోజులు సెలవు దినాలు కానున్నాయన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద నీడ ఉండేలా ఏర్పాట్లు చేయాలని, నీటి వసతి, కూలర్లుఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఒకే కుటుంబంలోని ఓటర్లకు వేర్వేరు పోలింగ్ కేంద్రాలు ఉండడంతో ఓటు వేయడానికి అనాసక్తి ప్రదర్శిస్తున్నారన్నారని, వారికి వాహనాలు సమకూర్చాలని కోరారు.

మంత్రి పొన్నంపై ఎన్నికల అధికారికి ఫిర్యాదు

భగత్‌నగర్, మే 5: వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్న మంత్రి ప్రభాకర్ ఎన్నికల ప్రచారాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర నాయకులు కొట్టె మురళీ కృష్ణ ఆధ్వర్యంలో ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంటర్వ్యూలలో ప్రచార సభలలో పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. భారతీయుల ఆరాధ్యదైవమైన శ్రీరాముని పేరును వాడుతూ హిందువుల మనోభావాలు దెబ్బ తీస్తున్నాడన్నారు. కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో శానిటేషన్ కార్మికుల వద్ద డబ్బులు తీసుకున్నారని నిరాధారమైన ఆరోపణలు చేస్తూ ఓటర్లను అయోమయానికి గురి చేసేలా ప్రభావితం చేస్తున్నారన్నారు. మంత్రిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

'ఓటమి భయంతోనే ఆరోపణలు'

కరీంనగర్ అర్బన్, మే 5: ఓటమి భయంతోనే కరీంనగర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్, అధికారం కోల్పోయిన బాధలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మతిభ్రమించి తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన కార్పొరేటర్లు విమర్శించారు. ఆదివారం పద్మనాయక కల్యాణ మండపంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ డబ్బుల కోసం అమ్ముడుపోయి కాంగ్రెస్ పార్టీలో చేరినట్టుగా బండి సంజయ్, గంగుల కమలాకర్‌లు ఆరోపించడాన్ని ఖండించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించు కుంటా మన్నారు. ఈకార్యక్రమంలో మెండి చంద్రశేఖర్, కోల ప్రశాంత్, కాశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, నేతికుంట యాదయ్య, భూమాగౌడ్, ఆకుల నరసయ్య, కోల ప్రశాంత్, పిట్టల శ్రీనివాస్, నాయకులు వైద్యుల అంజన్ కుమార్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పులి ఆంజనేయులుగౌడ్, మల్యాల సుజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి గంగుల కమలాకర్ మైనార్టీ యువసేన

కరీంనగర్ అర్బన్, మే 5: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్‌కు బిగ్ షాక్ తగిలింది. గంగుల కమలాకర్ మైనార్టీ యువసేన దళం కాంగ్రెస్‌లో చేరింది. ఆదివారం మానకొండూరు ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ క్యాంపు కార్యాలయంలో యువసేన అధ్యక్షుడు ఎండీ సర్వర్ అలీ ఆధ్వర్యంలో 60 మంది డివిజన్ అధ్యక్షులు, 200 మంది కార్యకర్తలు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో అఫ్రోజ్, ఇస్మాయిల్, ఫెరోజ్, ఉస్మాన్, అజీమ్, రఫీఖ్, నయీమ్, జమీల్, ముక్తార్, ఖదీర్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ అధినేతకు ఘన స్వాగతం

కరీంనగర్ టౌన్, మే 5: బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కరీంనగర్ బీఆర్ఎస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఆదివారం జగిత్యాల బస్సుయాత్రకు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి కరీంనగర్ మీదుగా వెళ్తుండగా కోతిరాంపూర్ వద్ద మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కేసీఆర్‌కు ఘనస్వాగతం పలికారు. అక్కడే కార్పొరేటర్ మర్రిభావనసతీష్ మంగళహారతితో స్వాగతించగా కార్పొరేటర్ ఐలేందర్‌యాదవ్, పలువురు నాయకులు కేసీఆర్‌కు అభివాదం చేశారు. అక్కడి నుంచి కమాన్ మీదుగా తెలంగాణ చౌక్‌కు బస్సులో చేరుకున్న కేసీఆర్‌కు మేయర్ యాదగిరి సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్, నగర అధ్యక్షుడు హరిశంకర్, కార్పొరేటర్లు వాల రమణారావు, గందె మాధవి మహేశ్, బోనాల శ్రీకాంత్, దిండిగాల మహేశ్, మాజీ కార్పొరేటర్ నందెల్లి రమాదేవి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. కోర్టు చౌరస్తా, రేకుర్తి చౌరస్తాలలో కేసీఆర్‌కు పార్టీశ్రేణులు, నాయకులు ఘన స్వాగతం పలికారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

కరీంనగర్ కల్చరల్, మే 3: నగరంలోని గాంధీరోడ్ వైశ్యభవన్‌లో ఆదివారం వైశ్యసేవా కేంద్రం ఆధ్వర్యంలో వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని కన్నుల పండువలా నిర్వహించారు. పురాణం మహేశ్వరశర్మ బృందం వైదిక నిర్వహణలో కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం షిర్డీసాయి భక్త భజన మండలి ఆధ్వర్యంలో మణిద్వీపవర్ణన, 21మార్లు హనుమాన్ చాలీసా పారాయణాలు చేశారు. కార్యక్రమంలో సేవా కేంద్రం అధ్యక్ష కార్యదర్శులు చిదుర సురేశ్, పెద్ది విద్యాసాగర్, ఆర్థిక కార్యదర్శి ముస్త్యాల రమేశ్, డైరెక్టర్లు ఎలుగందుల మునీందర్, పోకల లక్ష్మీనారాయణ, కైలాస నవీన్, గౌరిశెట్టి సుమన్, రావికంటి కృష్ణకిషోర్, కొండ రాంబాబు, రామిడి శ్రీధర్, మాదూరి మల్లేశం పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా

-కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు


హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు

హుజూరాబాద్, మే 5: కరీంనగర్ ఎంపీగా తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. ఆదివారం హుజూరాబాద్ పట్టణంలోని సూపర్‌బజార్ రోడ్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వెలిచాల రాజేందర్‌రావు మాట్లాడుతూ రాముడి పేరు చెప్పి ఎన్నికలకు వచ్చిన బండి సంజయ్‌ను ఓడగొట్టాలన్నారు.

●పార్లమెంట్ ఎన్నికల కోడ్ అనంతరం పేదలకు రేషన్‌కార్డులు, మహిళలకు రూ. 2500 పింఛన్ మంజూరు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అనంతరం చెల్పూర్ గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీల సంఘం నాయకులు మంత్రి పొన్నం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

●హుజూరాబాద్ పట్టణ శివారులోని పరకాల క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు, నియోజక వర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్‌ల వాహనాలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

●కరీంనగర్ అర్బన్: బీసీ, ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల రిజర్వేషన్ ఎత్తి వేసేందుకు బీజేపీ కుట్ర చేస్తుందని, ఈ కుట్రను చేదించాలని, కాంగ్రెస్‌పార్టీకి ఓటు వేసి గెలిపించాలని తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ, కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య పిలుపునిచ్చారు. డీసీసీ కార్యాలయంలో ఆదివారం ఉమ్మడి జిల్లా పెరిక కులస్తులతో పాటు వికలాంగులు, వితంతువులు, వృద్దులు, ఒంటరి మహిళలు, కల్లు గీత, చేనేత కార్మికులు సకల జనుల సమావేశం జరిగింది.

●కరీంనగర్ అర్బన్: ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన జమ్మికుంట మండలానికి చెందిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ఆదివారం కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలచాల రాజేందర్‌రావును ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో రాజేందర్ రావును కలిసిన వారిలో జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని కోటి, సర్పంచులు ఉన్నారు.

●కరీంనగర్ అర్బన్: కాంగ్రెస్ మేనిఫెస్టోను కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రతి పల్లెకు ప్రతి గల్లీలో అందరికీ క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలిసేలా చేరేలా చొరవ తీసుకోవాలని ఆలిండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ రీసెర్చ్ విభాగం నేషనల్ హెడ్ నావికా హర్షే పిలుపునిచ్చారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో ఏర్పాటు చేసిన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం అఫీషియల్స్ ప్రొఫెషనల్‌తో ముఖాముఖి కార్యక్రమంలో. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు, తెలంగాణ ఇంచార్జి ఇర్ఫాన్ అజీజ్‌తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్న నావికా హర్షే సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.

●కరీంనగర్‌లోని 25వ డివిజన్‌లో రాజేందర్‌రావు గెలుపు కోసం జోన్ 3 ఇంచార్జి నడిపెల్లి అశోక్‌రావు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు.

●సుభాష్‌నగర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ 6 గ్యారంటీలు అమలు ఖాయమని రెడ్డి సంఘం నాయకులు నరహరి జగ్గారెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఆయన మాట్లాడారు.

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం


వీణవంకలో కేసీఆర్‌కు వీడ్కోలు తెలుపుతున్న నాయకులు

వీణవంక, మే 5: మండల కేంద్రంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం అయింది. ఆత్మీయ సమ్మేళనంలో కేసీఆర్ మాట్లాడుతూ దళితబంధు పైలెట్ ప్రాజెక్టు హుజూరాబాద్ నియోజకవర్గంలో అమలు చేశామని చెప్పారు. దళిత బంధు ప్రాజెక్ట్ అమలుతో హుజూరాబాద్ దళితులు ఆత్మ గౌరవంతో బతుకుతున్నారని తెలిపారు. సమ్మేళనానికి సుమారు ఐదు వేయిలకు పైగా ప్రజలతో సమ్మేళనం ఏర్పాటు చేశారు.శనివారం అర్ధరాత్రి వీణవంకకు చేరిన కేసీఆర్ రాత్రి బస చేసి ఉదయం పలువురు స్థానిక నాయకులతో పార్టీ నేతలతో ముచ్చటించారు.స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు.సభ విజయవంతం కావడంతో కేసీఆర్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని అభినందించారు.కేసీఆర్ సభ అనంతరం సభ స్థలం నుంచి బస్టాండు కూడలి వరకు డప్పు చప్పుల్లతో మహళల కొలాటలతో భారీ ర్యాలీ నిర్వహించి విడ్కోలు తెలిపారు. అనంతరం జగిత్యాలలో బస్సు యాత్రకు బయలు దేరి వెళ్ళారు.ఈ కార్యక్రమములో ఎంపీపీ ముసీపట్ల రేణుక తిరుపతి రెడ్డి,జడ్పీటీసీ మాడ వనమాల సాధవ రెడ్డి,నాయకులు వాల బాలకిషన్ రావు,గంగాడి తిరుపతి రెడ్డి,రాపర్తి అఖిల్ ,పొన్నాల అనిల్,అడిగోప్పుల సత్యనారాయణ పాల్గొన్నారు.

మానకొండూర్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్ర మానకొండూర్‌కు చేరుకోవడంతో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం ఘనస్వాగతం పలికారు. హుజూరాబాద్ నుంచి శంకరపట్నం మీదుగా కేసీఆర్ బస్సు యాత్ర సాగింది. బీఆర్ఎస్ కార్యకర్తలు బస్సును ఆపి పూల వర్షం కురిపించారు. దీంతో కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై రాకపోకలు స్తంభించిపోయాయి. సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శంకరపట్నం: శంకరపట్నం మండలం ఆముదాలపల్లి గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మండల బీఆర్ఎస్ నాయకులు ఆదివారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వీణవంక బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకొని కరీంనగర్‌కు బస్సులో వెళ్తుండగా ఆము దాలపల్లి, మొలంగూర్, కేశవపట్నం గ్రామాల్లోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరై కేసీఆర్‌కు పూలతో స్వాగతం పలికారు.

కాంగ్రెస్‌ను ఆదరించాలి

జమ్మికుంట, మే 5: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఆదరించాలని నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జమ్మికుంట మున్సిపాల్టీ పరిధిలోని 9వ వార్డులో కౌన్సిలర్ పొనగంటి రామ్మూర్తి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు వివరిస్తూ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సరికె సుమన్, పొనగంటి రాజు, పొనగంటి రవి, కోరె సదానందం, ఊడుగుల మల్లయ్య, పొనగంటి కుమార్, దేవేంద్రచారి, పొనగంటి కొంరయ్య, వంశీ, గణేష్, భాను పాల్గొన్నారు.

చొప్పదండి: చొప్పదండి పట్టణంలోని పలువార్డుల్లో పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు మద్దతుగా ఆదివారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షు డు ముద్దం తిరుపతి గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహిం చారు. ఆ రు గ్యారంటీలపై పట్టణ ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిం చాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

వీణవంక, మే 5: మండలంలోని మాల్లారెడ్డిపల్లి, చల్లూరు, వీణవంక గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితల ప్రణవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వొడితల ప్రణవ్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎక్కటి రఘుపాల్ రెడ్డి, కొమ్మిడి రాకేష్‌రెడ్డి, చింతల శ్యాంసుందర్‌రెడ్డి, నల్ల కొండాల్‌రెడ్డి, సాహెబ్ హుస్సేన్, కామిడి శ్రీపతిరెడ్డి, వొరెం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఏఎంసీ చైర్మన్

రామడుగు, మే 5: మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో దేశ్‌రాజ్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్కపల్లి లచ్చయ్య ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతో పాటు సుమారు 100మందికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

'ఓటు అడిగే హక్కు లేదు'

జమ్మికుంట రూరల్, మే 5: ఓటు అడిగే హక్కు బీజేపీ, బీఆర్ఎస్‌కు లేదని కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల కాంగ్రెస్ పార్టీ మేనేజ్‌మెంట్ కో ఆర్డినేటర్ సదయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఐదు గ్యారంటీలు అమలు చేసిందని తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదలకు మేలు జరుగుతుందని తెలిపారు.

జమ్మికుంటలో నేడు అన్నమలై ప్రచారం

జమ్మికుంట రూరల్, మే 5: బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కు మద్దతుగా పార్టీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నమలై సోమవారం జమ్మికుంటలో ప్రచారం నిర్వహించనున్నట్లు నాయకులు గట్టు సాయిరాం ఆదివారం ఒక ప్రకటనలో తెలి పారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వచ్చి ప్రచార కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని కోరారు.

మంత్రి పొన్నంకు సన్మానం

జమ్మికుంట రూరల్, మే 5: ఇటీవల హుజూరాబాద్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన జమ్మికుంట మండల తాజా మాజీ సర్పంచ్‌లు ఆదివారం కరీంనగర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో దేశిని కోటి, ఎరబెల్లి రాజేశ్వర్‌రావు, తాజా మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కరీంనగర్ రూరల్, మే5: మండలంలోని నగునూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎస్‌సి 2001-2002 విద్యాసంవత్సరానికి చెందిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. పూర్వ ఉపాధ్యాయుడు ఆనందరాములు, బోడ మల్లారెడ్డి, శ్రీధర్‌రావు, కె చుక్కారెడ్డి, కె మదుకర్, మునీర్ అహ్మద్, పద్మలత, రాజమణి పాల్గొన్నారు. ఆనాటి ప్రధానోపాధ్యాయుడు సుగుణాకర్‌రావు మరణించగా శ్రద్ధాంజలి ఘటించారు. ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ బద్దెనపల్లి రాజు, కోగూరి శ్రీను, దావు అనిల్, కోట కరుణాకర్, రమాదేవి, శ్రీదేవి, లత, మమత తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

●కరీంనగర్ టౌన్: నగరంలోని రామకృష్ణ ఇంగ్లీష్ మీడియంలోని 1989-90 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం స్థానిక ఓ ఫంక్షన్‌హాల్లో ఘనంగా జరిగింది. 34 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారంతా సందడిగా గడిపారు. కార్యక్రమంలో కొండ రాంబాబు, ధనపురి సాగర్, బి శేఖర్, జస్పాల్, ఇలియాజ్, కమీల్, హకీమ్, గోవర్ధన్, పావని, సునీత, శాంతి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లవర్ డెకోరేషన్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక

కరీంనగర్ రూరల్, మే5: నగరశివారులోని తీగలగుట్టపల్లిలో ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఫ్లవర్ డెకోరేషన్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో వ్యవస్థాపక, గౌరవ అధ్యక్షుడిగాఅలిపిరెడ్డి చంద్రమౌళి, బొమ్మిడి కరుణాకర్, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా చత్రాజు శ్రీనివాస్, ఎనుగందుల శ్రీనివాస్, కోశాధికారిగా కోన శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తుమ్మల మధు, నక్క కుమార్, ప్రచార కార్యదర్శిగా బొమ్మిడి రాజేందర్, వర్కింగ్ ప్రసిడెంట్‌లుగా యండి దబ్బీర్, నంద కిరణ్, ఆర్గనైజింగ్ సెక్రెటరిలుగా ఎడ్ల రమేష్, బొల్లం సంతోష్, సహాయ ప్రచార కార్యదర్శులుగా సంతోష్ సత్యం, అలి అహ్మద్, ముఖ్య సలహాదారులుగా అంజనేయులు, సోను, మదిర కనుకయ్య తదిరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'గుజ్జుల'ను పరామర్శించిన ఎమ్మెల్యే గంగుల

కరీంనగర్ టౌన్, మే 5: మాజీ ఎమ్మెల్యే బీజేపీ రాష్ట్ర నాయకుడు గుజ్జుల రామకృష్ణారెడ్డిని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పరామర్శించారు. ఆయన సోదరుడు రాజనరేందర్‌రెడ్డి ఇటీవల అనా రోగ్యంతో మృతిచెందగా ఆదివారం రామకృష్ణారెడ్డి స్వగ్రామం ఖమ్మరికాన్‌పేటకు వెళ్లి రామకృష్ణారెడ్డిని, ఆయనకుటుంబసభ్యులను పరామర్శించారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నేతి రవివర్మ, మిడిదొడ్డి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

మానకొండూర్, మే5 : మండలంలోని వేగురుపల్లి, లక్ష్మీపూర్, పచ్చునూర్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన 50మంది కార్యకర్తలు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సమక్షంలో ఆదివారం బీజేపీలో చేరారు. వివిధ పార్టీల నాయకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకట్‌రెడ్డి, రంగు భాస్కరాచారి, మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'కర్ణాటక ఎంపీని అరెస్టు చేయాలి'

రామడుగు, మే 5: మహిళలను లైంగిక వేధింపులకు గురిచేస్తున్న కర్ణాటక ఎంపీ ప్రజ్వల్ రెవణ్ణను తక్షణమే అరెస్టు చేయాలని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న కోరారు. మండలంలోని గోపాల్‌రావుపేటలో మండల మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి నేరేళ్ళ కవిత, పొన్నం కవిత పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బీసీలకు న్యాయం

చిగురుమామిడి, మే 5: బీసీలు సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని జడ్పీటీసీ, జడ్పీ ఫ్లోర్‌లీడర్ గీకురు రవీందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీసీ కులాల అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంఘం మండల మహిళా అధ్యక్షురాలు ముంజ శిరీష, కోహెడ కొమురయ్య, తాళ్లపెల్లి తిరుపతిగౌడ్, దాసరి ప్రవీణ్, విష్ణుమాచారి, గట్టు ప్రశాంత్, తోట సతీష్, బోయిని వంశీ పాల్గొన్నారు.

ఎంఈవో కుటుంబానికి పరామర్శ

చొప్పదండి, మే 5: వడదెబ్బతో మృతి చెందిన ఎంఈవో బత్తుల భూమయ్య కుటుంబాన్ని ఆదివారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి వేరు వేరుగా పరామర్శించారు. ఈ సందర్భంగా వారు భూమయ్య చిత్రపటానిక పూల మాల వేసి నివాళులర్పించారు. కాగా తండ్రి మరణాన్ని దిగమింగుకొని కూతురు అక్షయ ఆదివారం నీట్ పరీక్షకు హాజరైంది.

విద్యార్థినికి సన్మానం

రామడుగు, మే5 : రామడుగు గ్రామానికి చెందిన నాగి రేష్మ అనే విద్యార్థిని ఆదివారం గోనే సత్యం, యువజన సంఘం జిల్లా అవార్డు గ్రహీత అశోక్, జెట్టిపల్లి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేష్మ పదో తరగతిలో 9.8 జీపీఏ, ఇంటర్మీడియట్ ఎంపీసీలో వెయ్యి మార్కులకు గాను 968 మార్కులు సాధించిందని అభినందించారు.

పార్లమెంటు మేనేజ్‌మెంట్ కో ఆర్డినేటర్‌గా శ్యాంసుందర్

వీణవంక, మే 5: మండలంలోని మామిడాలపల్లి గ్రామానికి చెందిన చింతల శ్యాంసుందర్‌రెడ్డిని కరీంనగర్ పార్లమెంటు మేనేజ్ మెంట్ కో ఆర్డినేటర్‌గా టీపీసీసీ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు నియమించారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నియామకం

కరీంనగర్ అర్బన్, మే 5 : తెలంగాణ ప్రదేశ్ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా కరీంనగర్‌కు చెందిన రజనీష్ భూక్యను నియమిస్తూ తెలంగాణ ప్రదేశ్ లీగల్ సెల్, హ్యూమన్ రైట్స్, ఆర్టీఐ డిపార్టమెంట్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రజినీష్ మాట్లాడుతూ తన మీద నమ్మకంతో తనకు ఈ బాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్ రెడ్డికి, తెలంగాణ ప్రదేశ్ లీగల్ సెల్ హ్యూమన్ రైట్స్ డిపార్ట్మెంట్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్‌కు, సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.